
# విమలా విశ్వం - విచిత్ర వివాహం

ఎస్.వి. రమాదేవి



"నో....వీల్లేదు. నేను మాత్రం నా పేరు వెనుక భర్త పేరును అతికించను గాక అతికించను. మరీ అంత భర్తచాటు వ్యక్తిని కావటం నా పాలసీకే విరుద్ధం" గట్టిగా తన నిర్ణయాన్ని తెలిపింది విమల, ఆ విషయంగా కాలేజీలో....లీజర్ అవర్స్‌లో....ఫ్రండ్స్ మధ్య వచ్చిన చర్చలో!

"అదేమే! ఇప్పుడదేగా నాగరికత? భార్య పేరు వెనుక అందంగా తమ స్వంతదారు పేరును, ఆ పేరుపైగల తమ హక్కును అందరూ అర్థం చేసుకోవాలనే తపనను నువ్వు అంగీకరించక పోవటం ఆశ్చర్యంగా వుంది" అందో స్నేహితురాలు.

"మరీ అంత గుడ్డిగా ఒకర్ని అనుసరించటం, ఒకరి అభిప్రాయాలతో ఏకీభవించటం కూడా నా పాలసీ కాదని గుర్తుంచుకో!" ఖచ్చితంగా చెప్పింది విమల.

"ఏమిటో....నీబాదస్తం!" అన్నది వింటూన్న ఇంకొక ఆమె. వాళ్ళంతా విమల సంగతి తెలిసిన వారే కనుక అట్టే ఆశ్చర్యపోలేదెవరూ.

*

"ఛట్! వీల్లేదంటే వీల్లేదు. మరీ అంత వ్యక్తిత్వంలేని వెధవనని అనుకోకు. భార్య పేరు వెనుక ఆ పేరుకు బాడీగార్డులా నాపేరు ఉండటాన్ని నేను సహించనుగాక సహించను. అది నా పాలసీకే విరుద్ధం!"


తన కాలేజీ రోజుల్లోనే...ఒకానొక సందర్భంలో విశ్వం కూడా తన స్నేహితులతో అదే అన్నాడు. ఆ సందర్భం....ఏదో నవల చదువుతూ ఆ శ్రీమతి నవలారచయిత్రి పేరును అచ్చులో చూస్తూ.... ఆవిడ పేరు వెనుక తోకలా వున్న ఆవిడగారి భర్తపేరు-విశ్వం దృష్టికి దీనాతిదీనంగా కనబడ్డ సందర్భం....ఆ సందర్భంలో....విశ్వం అభిప్రాయం తెలిసిన అతడి స్నేహితుడు 'ఒకవేళ నీ కాబోయే భార్య నీ పేరును తన పేరు వెనుక ఉపయోగిస్తే ఏం చేస్తా'వనే ప్రశ్న వేసే ఉంటాడని చెప్పక్కర్లేదు.

తన ప్రశ్నకు విశ్వం ఇచ్చిన ఖచ్చితమైన సమాధానం వినేసరికి మరేం మాట్లాడలేక ఆ మిత్రుడు, ఆ సమస్యను కాలానికే వదలి మౌనం వహించాడు.

*

"ఆ అబ్బాయిని చూడు. ఎలుగుబంటిలా

మన దేశంలో స్త్రీలకు 18 ఏళ్ళు నిండితేగాని పెళ్ళి చెయ్యకూడదన్న చట్టం 25 సంవత్సరాలనుంచీ అమలులో ఉంది. అయితే అది ఎంతగా ఆచరణలో ఉందో ఇటీవల 1971లో బంగ్లాదేశ్ యుద్ధం సందర్భంగా తెలియవచ్చింది. ఆ యుద్ధంలో మరణించిన సైనికులు చాలా మంది భార్యలకు 15 ఏళ్ళు కూడా నిండలేదట!



ఆ జుత్తూ వాదూ....మనవాళ్ళు నాగరికతంటూ జంతువులను పోలుతున్నారు రూపంలో. పాపం.... అమాయకులు!" హాస్టల్ పై బాల్కనీలో నిల్చుని వీధిలోకి చూస్తూ అంది విమల.

"నీకు హిప్పీలంటే ఇష్టంలేదా విమలా?" వింటూన్న ఫ్రండ్ అడిగింది.

"హిప్పీలంటేనే నాకు తలనెప్పి! డ్రామాల వాళ్ళలా ఆ హెయిర్ కట్టింగూ....వాళ్లూను!" మూతి విరిచింది విమల.

"ఒకవేళ నీ కాబోయే భర్తే హిప్పీ హెయిర్ స్టయిల్లో వుంటే....?" ఎదురు ప్రశ్న వేసింది ఎదుటి అమ్మాయి.

"కాబోయే భర్త అన్నావు? అసలు హిప్పీయే అయితే, అతడు నాకు భర్త ఎలా అవుతాడే పిచ్చి దద్దమ్మా....నా అంగీకారం లేకుండా?" నవ్వింది విమల.

"అంటే నీ యిష్టప్రకారమే జరుగుతుందన్న మాట నీ వివాహం?"

"ష్యూ....ర్!!" నొక్కిపలికింది విమల.

*

"ఒరేయ్! ఈ వీక్లీ అట్టమీది బొమ్మచూడు. ఎవరో కొత్త స్టార్ కాబోలు. చాలా అందంగా వుంది కదూ? ఆ అందమైన నీలికళ్ళు, చక్కని ఆ ఒళ్ళు, ఆ చేతులకు అందంగా పొడవుగా వున్న ఆ చేతి వ్రేళ్ళు, ఆ వ్రేళ్ళకు ఏపుగా పెరిగిన నైల్ పాలిష్‌తో నిగనిగలాడే చక్కని ఆ గోళ్ళు..."

"స్టాప్! స్టాప్!!" మిత్రుడి వర్ణనలకు నవ్వాడు విశ్వం. "ఒరేయ్! నీ వర్ణనా సాహిత్యానికి రైమింగ్ కుదరాలనా....లేక నిజంగా ఆ దెయ్యం గోళ్ళు కూడా నీకు నచ్చాయనా.... వూరికే మెచ్చుకుంటున్నావ్?" అన్నాడు ఎక్కడికో వెళ్ళేందుకు షర్ట్‌తీసి వేసుకుంటూ.

"దెయ్యం గోళ్ళేమిట్రా? ఆడపిల్లల వ్రేళ్ళకు ఏపుగా పెరిగిన గోళ్ళు కూడా ఓ అందమే తెలుసా?" అన్నాడా మిత్రుడు ఉక్రోషంగా.

"ఓహోహో....ఆడపిల్లలకు ఏపుగా పెరిగిన గోళ్ళూ అందమే; నీకు ఏపుగా పెరిగిన ఆ మాసిన గడ్డమూ అందమే....నీ ముఖంలా వుంది నీ పొగర్త!" విసుక్కున్నాడు విశ్వం....మరో పదిరోజుల్లో తిరుపతి వెళ్ళాలని గడ్డం మాసినా గీసుకోని స్నేహితుడ్ని విసుగ్గా చూస్తూ.

"ఏరా! ఒకటడుగుతాను....అస్సలు నిజంగా నీకు అమ్మాయిలు గోళ్ళ పెంచుకోవడం ఇష్టం లేదా చెప్పు?" అన్నాడా మిత్రుడు అసలు పాయింటుకు వస్తూ.

"ఛ! దర్జీ! పూర్వం రాక్షసులకు గుర్తుగా వేసే చిహ్నాల్లో ఈ గోళ్ల కూడా ఒకటి. మాట్లాడ్తే గుచ్చుకునేలా ఆ వెధవ గోళ్ళకు ఓ అందమంటూ వుందంటే నాకు చచ్చేనవ్వు వస్తుంది. అసలు అలాంటి ఆయుధాలు పెంచుకునే ఇప్పుడు వాళ్ళంతా సమానహక్కులంటూ ఉద్యమాలు లేవదీస్తున్నారేమో? ఏమైనా నేటి స్త్రీలు నాగరికత పేరుతో కొన్ని వేల సంవత్సరాలక్రితపు అనాగరికుల లక్షణాలను మళ్ళీ జ్ఞప్తికి తెస్తున్నారు!" అటువంటి స్త్రీలపై ఓ రకపు సానుభూతి చూపుతూ ఓ లెక్చరిచ్చాడు విశ్వం.

అంతా విని, కాస్సేపాగి, "అహ....తెలీకడుగుతానూ...." అన్నాడు మిత్రుడు ఈసారి కాస్త నాన్చుతూ.

"నీకు తెలియకపోయినా, నువ్వడగబోయే దేమిటో నాకు తెలుసు లేవోయ్! ఒకవేళ నా కాబోయే భార్యే ఇలా గోళ్ల పెంచితే....పెళ్ళికి ముందే, మంగలి చేత కాలిగోళ్ల తీయించే సన్నివేశమొకటి ఏర్పాటు చేస్తారు చూడూ.... మన పెద్దవాళ్ళు? అప్పుడే ఆమెగారి చేతిగోళ్ళూ తీయించేస్తాను. 'కాదూ'కూడదూ' అంటే పీటల మీద నేనే నా షేవింగ్ సెట్టు కత్తెరతోపాటు కూర్చుని, ఆమె చేయేదో నాకు అందగానే.... మిగతా పని నేనే చూసుకుంటాను. అంచేత నువ్వేం నా గురించి దిగులుపడకు మిత్రమా!" అని కూడా అభయమిచ్చాడు విశ్వం.

విశ్వం స్వభావం తెలిసినవాడు కనుక, ఆపై నోరు మెదపలేదు ఆ తిరుపతి వెళ్ళబోయే మిత్రుడు.

*

"చి॥ సౌ॥ విమలను....చి॥ విశ్వనాథ్‌కు.... ఇచ్చి....వధువు స్వగృహంబున...."

అంటూ ఓ రోజు విమలా విశ్వంల స్నేహ బృందానికంతటికీ ఆహ్వానాలు వచ్చాయి. ఇదెలా జరిగిందని కొందరూ, పెద్దల బలవంతపు కల్యాణమని కొందరూ మాటామాటా అనుకున్నారు కూడా!

ఆ రోజునే....కల్యాణమహోత్సవం!

అయితే...హిప్పీజుత్తును అసహ్యించుకునే విమల, విశ్వం భుజాల దాకా జారిన జుత్తుపై మురిపెంగా జీలకర్ర, బెల్లం పెడుతుంటే....

ఎదురుగావున్న బిందెలో ఉంగరాలు వెతుకుతూ, చిలిపిగా విమల పొడవాటి చేతిగోళ్ళను విశ్వం ఆప్యాయంగా నిమురుతూంటే....

"ఇంకా ఉత్తి విమలేమిటమ్మాయ్! మాంగల్య ధారణ కూడా జరిగిపోయింది. ఇకపై 'శ్రీమతి విమలా విశ్వం' అని పిలువ్!" అంటూ విమల స్నేహితురాలితో విమల వదినగారు ఓ వంక హాస్యం పట్టిస్తూంటే....వింటూ, ముసిముసిగా నవ్వుకుంటూన్న పీటల మీది ఆ వధూవరులను చూస్తుంటే........

విశ్వం, విమలల స్నేహితుల....స్నేహితురాళ్ళ....ముఖాలు విస్మయంతో తెల్లబోయాయి